క్లుప్తంగా

విజయేంద్రతీర్థుల పూర్వారాధన పూజలు



ప్రత్యేక అలంకరణంలో రాఘవేంద్ర, విజయేంద్రతీర్థుల మూలవిరాట్‌లు

హొళగుంద: మండల కేంద్రంలో సోమవారం విజయేంద్రతీర్థుల పూర్వారాధన పూజలు ఘనంగా జరిగాయి. ఆంజనేయస్వామి ఆలయంలో గత నెల 30 నుంచి ప్రారంభమైన విజయేంద్రతీర్థుల ఆరాధనోత్సవంలో భాగంగా సోమవారం జరిగిన పూర్వారాధన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా రాఘవేంద్ర, విజయేంద్రతీర్థుల మృత్తిక బృందావన సన్నిధానంలో నిర్మల్య విసర్జన, పంచామృత అభిషేక, తులసీ అర్చన, మహా నైవేద్యం, పండితుల ఉపన్యాస భజన, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

జయహో భారత్



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తుగ్గలి: 17 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ కరేబియన్ గడ్డపై దక్షిణాఫ్రికాను ఓడించిన టీమిండియా టి20 ప్రపంచ క్రికెట్ చాంపియన్‌గా నిలిచింది. దీంతో మండల కేంద్రమైన తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. విద్యార్థులు జాతీయ జెండాలతో 'జయహో భారత్' అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ విజయం యువ క్రికెటర్లకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఎంఈవో–2 రామవెంకటేశ్వర్లు అన్నారు. టీమిండియాను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ చందూనాయక్ పాల్గొన్నారు.

సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

తుగ్గలి: మండలంలో రెండు సహకార సంఘాలకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఉప్పర్లపల్లి సహకార సంఘానికి పత్తికొండ కేడీసీసీ బ్యాంకు ఏజీఎం రామ్మోహన్, మార్లెళ్ల సహకార సంఘానికి ఆదోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్‌లను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వీరు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సొసైటీ వర్గాలు తెలిపారు.

ప్రత్యేక అధికారి నియామకం



బాధ్యతలు చేపట్టిన రవి ప్రకాష్

ఆస్పరి: ఆలూరు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రవిప్రకాష్‌ను ఆస్పరి సొసైటీకి ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు సోమవారం ఆయన ఆస్పరి సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రైతులకు అందుబాటులో ఉంటూ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారిని సీఈఓ నరసింహుడు, సొసైటీ సిబ్బంది ఉషారాణి, సుధాకర్, హనుమంతరెడ్డి, లక్ష్మినారాయణ, లక్ష్మన్న కలిసి అభినందించారు.

పదోన్నతి ఉద్యోగికి సన్మానం



లైన్ మెన్ నరసప్పను సన్మానించిన ఉద్యోగులు

ఆలూరు: స్థానిక విద్యుత్ ఏఈ కార్యాలయ లైన్ మెన్ నరసప్పకు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది మంత్రాలయం విద్యుత్ ఏఈ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ను ఆదోని, ఆలూరు విద్యుత్ శాఖ 1104 యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, ఏఈ, ఎల్ఐ, పోల్ టూ పోల్ కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నాయకులు శివ, లక్ష్మన్న, ఏఈ గురప్ప, పొంపయ్యస్వామి, దేవేంద్రప్ప తదితరులు మాట్లాడారు. ఎక్కడ పని చేసినా ఉత్తమ సేవలు అందించి పేరు సంపాదించుకోవాలని సూచించారు.

చట్టాల మార్పుతో సత్వర సేవలు

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు బ్రిటీష్ కాలం నాటి చట్టాలలో మార్పులు చేసిందని దీంతో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు వీలవుతుందని ఎస్ఐ రమేష్‌బాబు అన్నారు. సోమవారం రాత్రి మారిన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీకి రాజకీయ రంగు

- పార్టీ కండువాలతో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న కూటమి నేతలు
- అక్కడక్కడా సర్వర్ల మొరాయింపు



ఆలూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నేత వీరభద్రగౌడు



చిప్పగిరి: ఉద్యోగులు పింఛన్ల పంపిణీకి వెళ్లడంతో సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు, వేచి ఉన్న వివిధ సమస్యలపై వచ్చిన బాధితులు

ఆలూరు/రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీకి టీడీపీ నాయకులు రాజకీయ రంగు వేశారు. సోమవారం ప్రారంభమైన పింఛన్ల పంపిణీలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. పార్టీ కండువాలు కప్పుకుని, పార్టీ జెండాలు పట్టుకుని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని చోట్ల సచివాలయ ఉద్యోగులను పూర్తిగా పక్కన పెట్టి వృద్ధులు, వికలాంగులకు తమ చేతుల మీదుగా పింఛన్ నగదు అందించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి వారి ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టింది. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో వలంటీర్లను పక్కన పెట్టింది. ఒక్కో సచివాలయ ఉద్యోగికి కనిష్టంగా 50 ఇళ్ల నుంచి గరిష్టంగా 80 ఇళ్లను మ్యాపింగ్ చేసి పంపిణీ ప్రారంభించింది. కొన్ని చోట్ల సచివాలయ ఉద్యోగులను పక్కన పెట్టి కూటమి నాయకులు, కార్యకర్తలు పింఛన్ నగదు అందిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చారు. ఉద యం సర్వర్ మొరాయించడంతో 2 గంటల పాటు పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. సోమవారం సాయంత్రానికి మండలంలో 85 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

☛ టీడీపీ ఆలూరు నియోజకవర్గ నేత వీరభద్రగౌడు ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ముందుగా ఆలూరు తేరు బజారులో వాల్మీకి విగ్రహానికి పూలమాలు వేసి, టీడీపీ జెండాను ఆవిష్కరించి వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాల్లోని పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వైకుంఠం శివప్రసాదు, టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి హొళగుంద, ఆలూరు మండలాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

☛ నడవలేని వృద్ధులు, ఒంటరి మహిళల సౌకర్యార్థం గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లను ఇళ్ల వద్దకే పంపి పింఛన్లను అందజేశారు. కాగా చంద్రబాబు నాయుడు వలంటీర్లను తొలగించబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చి.. ఇప్పుడు వారు లేకుండానే పింఛన్ల పంపిణీ చేపట్టారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ **చిప్పగిరి:** మండలంలో పింఛన్ల పంపిణీ మొదటి రోజు అంతంత మాత్రమే సాగింది. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లకుండా ఒక్క చోట కూర్చొని అక్కడికి వచ్చిన వారికి పింఛన్లను పంపిణీ చేశాంరు. అందరూ ఒకే చోట చేరడంతో కొన్ని చోట్ల సర్వ ర్లు మొరాయించడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు పంపిణీ మందకొడిగా సాగింది. కాగా సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీకి వెళ్లగా సచివాలయాలు బోసిపోయి కనిపించాయి. వివిధ సమస్యలపై వచ్చిన వారు గంటల తరబడి వేచి చూపి తి రిగి ఇళ్లకు వెళ్లారు. మండలంలోని నేమకల్లు, రామదుర్గం గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

☛ **ఆస్పరి:** ఏ హోదాలేని టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో హడావుడి చేశారు. ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, బిణిగేరి, యాటకల్లు, పుటకలమర్రి, కైరుప్పల, ములుగుందం, బనవనూరు తదితర గ్రామాల్లో పార్టీ కండువాలు వేసుకుని లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయగా అధికారులు, ఉద్యోగులు ప్రేక్షక పాత్ర వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా పిలవకుండా అధికారులు ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కారు. కాగా మొదటి రోజు మండలంలో 84 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

☛ **దేవనకొండ:** దేవనకొండ, అలారుదిన్నె గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీలో తోపులాట జరిగింది. టీడీపీలో ఆదిపత్య పోరు కారణంగా పింఛన్లను తాము పంచుతామంటే తాము పంచుతామంటూ ఇరువర్గాల నాయకులు తోసుకోవడంతో పింఛన్‌దారులు అసహనానికి గురయ్యారు. పార్టీ నాయకులు కలుగజేసుకుని యువ నాయకులకు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ చేతులమీదుగా దేవనకొండలో పింఛన్లను పంపిణీ చేశారు.

☛ **కృష్ణగిరి:** ప్రభుత్వం పెంచిన పింఛన్లను పంపిణీ చేయడంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలే ముందుండి కార్యక్రమాలను చేశారు. సోమవారం ఉదయం నుంచే గ్రామాల్లో పింఛన్‌దారులను ఒక్కచోటకు రప్పించి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకాలు చేసి అనంతరం పింఛన్ సొమ్ము అందజేశారు. వెల్దుర్తి సచివాలయంలో టీడీపీ నాయకుడు జ్ఞానేశ్వర్‌గౌడ్, బొమ్మిరెడ్డిపల్లెలో నాయకుడు సుబ్బరాయుడు, ఇలా ప్రతి గ్రామంలో ఆయా గ్రామాల నాయకులు పింఛన్లనను పంపిణీ చేశారు. కృష్ణగిరి మండలంలోని కొన్ని గ్రామాల్లో రచ్చకట్టల వద్ద పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయా మండలాల ఎంపీడీఓలు రాబర్ట్‌విల్సన్, శివశంకరప్ప పర్యవేక్షించారు. రెండు మండలాల్లో 90 శాతానికిపైగా పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

☛ **హొళగుంద:** మండలంలో మొత్తం 6,097 పింఛన్లు ఉండగా 5,571 పింఛన్లను పంపిణీ చేసి 92 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు.

నివాళి



ప్రణవి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణానికి చెందిన బొమ్మన సుదర్శన్‌రెడ్డి భార్య బొమ్మన ప్రణవి(32) సోమవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకట నాయుడు, నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కృష్ణగిరి: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే వ్యాధుల తమ దరి చేరవని వైద్యాధికారులు ప్రదీప్, వరప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం వారు సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్ సుజాతకు సూచించారు. తాగునీటిని క్లోరినేషన్ చేపట్టాలని, పాఠశాల ఆవరణంలో దోమలు లేకుండా ఫాకింగ్ చేపట్టాలన్నారు. డెంగీ, డయేరియా వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గజేంద్రరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



జొన్నగిరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి/మద్దికెర: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ తమ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం జొన్నగిరి, తుగ్గలి, మద్దికెరలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు ఇస్తున్నామన్నారు. హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ గోపాల్, సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెరవలిలో పెన్షనర్ల నిరీక్షణ..

మద్దికెర మండలం పెరవలి సచివాలయం వద్ద పెన్షనర్లు పింఛన్ కోసం గంటలకొద్ది నిరీక్షించాల్సి వచ్చింది.ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలిచ్చినా వారు రాకపోవడంతో పలువురు పెన్షనర్లు సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఎవరూ పింఛన్ పంపిణీ చేయకపోవడంతో అధికారులపై తీరుపై వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ అలివేలమ్మ అక్కడికి చేరుకొని పింఛన్ల పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి

హాలహర్వి: ప్రజలు అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా ప్రశాంతమైన జీవనాన్ని గడపాలని ఎస్ఐ నరేంద్ర సూచించారు. సోమవారం మండలంలోని మెదేహాల్ గ్రామంలో ఆయన పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలతో సమావేశమై మాట్లాడారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. పిల్లలను చదివించడంలో, ఆర్థికంగా రాణించడంలోనూ పోటీ పడాలన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

ఆయా మండలాల నుంచి వచ్చిన వినతుల్లో కొన్ని...

➡ ఆదోని మండలం ఆరేకల్ గ్రామానికి చెందిన వీరేష్ తనకు సొంతమైన సర్వే నంబర్ 89లో 4.50 ఎకరాల భూమిలో 4.50 సెంట్ల స్థలంలో పదేళ్ల క్రితం ఇంటిని నిర్మించుకున్నామని. ప్రస్తుతం ఇంటి సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని రోడ్డు మార్గం లేకుండా చేశారని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని అర్జీ సమర్పించాడు.

➡ హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో సర్వే నంబర్ 354/ఏలో ఒక ఎకరం భూమి కొనుగోలు ద్వారా సంక్రమించింది. మా తండ్రి చనిపోయిన తర్వాత భూమిని తన పేరిట రిజిస్టర్ చేయడానికి వెళ్లగా ఆన్‌లైన్‌లో ఆ భూమి దేవదాయ శాఖకు చెందినదిగా చూపుతోందని, విచారణ చేపట్టి పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

➡ ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన రంగయ్య సర్వే నంబర్ 583లో తనకు 2.05 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట నమోదై ఉందని, విచారణ చేపట్టి భూమిని తన పేరిట నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

➡ ఆదోని మండలం ఆరేకల్ గ్రామంలో అయ్యప్పకు సర్వే నంబర్ 147లో 2.40 ఎకరాల భూమి పెద్దల నుంచి వచ్చిందని, ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, దయచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో 49 మంది అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. గడువులోగా వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆయన ఆదేశించారు.

కార్యాలయపు పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ నూర్జహాన్, గృహ నిర్మాణశాఖ డీఈ రవికుమార్, ఆర్డీ నాగేంద్ర, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, సీడీపీఓ ఉమామహేశ్వరి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్యం లోపించకూడదు



సూచనలిస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుద్ధ్య లోపం కనిపించకూడదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఎంసీహెచ్, ఔషధశాల, ఎఫ్‌ఎం–4, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో సమన్వయం చేసుకుని శానిటేషన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంసీహెచ్ బ్లాక్ వద్ద నీరు నిలిచి ఉండకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు రూ.10లక్షల అంచనా అవుతుందని ఇంజినీర్లు చెప్పారని తెలిపారు. అండర్‌గ్రౌండ్ ఆల్టర్నేటివ్ కేబుల్స్‌కు రూ.80లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఏపీఎస్ పీడీసీఎల్ పవర్ 1000 హౌస్ దగ్గర గతంలో 8 మంది సిబ్బంది పనిచేసేవారని, వీరిని గతంలో తొలగించారన్నారు. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారని, పాతవారికి అదనంగా మరో ముగ్గురు సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి ఆంజనేయ స్వామి మండపంలో మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం ఉంటుందని ఆ పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు, హాజరుకావాలని ఆయన కోరారు.

కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి



దమ్మురులతో మునిస్వామి

దేవనకొండ: మండలకేంద్రంలోని దమ్మురులకు కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని సీపీఐ యం.ఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు మునిస్వామి అధికారులను కోరారు. సోమవారం ఆయన దమ్మురులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. 50 ఏళ్లుగా మండలంలో వీధి సర్కస్‌లు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డులు ఉన్నా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో వారి పిల్లలను చదివించుకోలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దమ్మురులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధర్మ, రాము, సురేష్, వెంకోజీ, నరేష్ పాల్గొన్నారు.

పదవీవిరమణ ఉద్యోగినికి సన్మానం



హెచ్ఎం మంజుల దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రత్నాపల్లె పాఠశాల హెచ్ఎం ఎస్ఆర్ మంజుల పదవీవిరమణ పొందారు. మంజుల దంపతులను సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఇందిర మాట్లాడుతూ 41 ఏళ్లు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రమేష్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై ర్యాలీ

హొళగుంద: అతిసార వ్యాధి (డయేరియా) నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి న్యూటన్ సూచించారు. సోమవారం పీహెచ్‌సీ వద్ద స్టాప్ డయేరియా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఏళ్లలోపు పిల్లలున్న ప్రతి ఇంటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. అతిసార వ్యాధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నీటిని కాచి వడబోసుకుని తాగేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చైతన్యం చేయాలన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పలువురి విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం నిరసనకు దిగారు. ఈ సందసర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో ప్రవేశ పెట్టిన సీబీఎస్ఈలో సెకండ్ లాంగ్వేజ్ కింద తెలుగుతోపాటు కన్నడ, ఉర్దూ మీడియాలను కొసాగించాలని డిమాండ్ చేస్తే పాఠశాల విభజన జరుగుతందని చెప్పి ఇప్పుడు ఆయా మీడియం విద్యార్థులు అడ్మిషన్ కోసం పాఠశాలకు వస్తే వారిని చేర్చుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నడ, ఉర్దూ విద్యార్థులకు పాఠశాలలో చేరేందుకు అవకాశం కల్పించాలని హెచ్ఎం నజీర్ అహమ్మద్‌ను కోరారు.



తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సీట్ల సంఖ్య పెంచాలి

దేవనకొండ: గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో సీట్లు పెంచి పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్‌కుమార్ కోరారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీట్లు పెంచాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించుకునే పరిస్థితి లేదన్నారు. గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో చేర్పించి చదివించుకుందామంటే సీట్లు లేవని వెనక్కి పంపిస్తుండటంతో వారి పిల్లలను బడి మాన్పించేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆలోచించి సీట్లు పెంచాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతి పత్రం అందించారు. ధర్నాలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్, నాయకులు శశి, మహేష్, రాము పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సీట్ల సంఖ్య పెంచాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు రమేష్, రవి, ఈశ్వర్ మాట్లాడుతూ నిరుపేద బాలికలను తల్లిదండ్రులు చదవించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీలో సీట్లను పెంచి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థినికి ప్రవేశం కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, రాజు, వీరేష్, రంగస్వామి, శ్రీకాంత్, ధనుంజయ, సుధాకర్, జస్వంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రవి, సిబ్బంది

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి సూచించారు. సోమవారం మొలగవల్లిలో డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలం కావడంతో దోమల వృద్ధి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాలు, ఇంట్లో నీటిని నిల్వ ఉంచరాదన్నారు. ఇంటి ఆవరణంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. జలుబు, దగ్గు, తలనొప్పి, రోజు విడిచి రోజు జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను సంప్రదించాలన్నారు. వాంతులు, విరేచనాలు అవుతుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో లభించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను లీటరు నీటిలో కలిపి 10 నిమిషాలకు ఒక సారి తాగాలన్నారు. వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. మూడు పూటలా వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ అంద్రూస్, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: అతిసార నివారణ, డెంగీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి ప్రదీప్ సూచించారు. కృష్ణగిరిలో సోమవారం వ్యాధుల నివారణ కార్యక్రమ ర్యాలీలో ఆయన పాల్గొని వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటి లీకేజీ వల్ల వచ్చే అతిసార వ్యాధి ప్రాణాంతకరమైందన్నారు. దోమ కాటుతో వచ్చే డెంగీ కూడా అంతే ప్రమాదకరమని వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధులు ప్రబలినప్పుడు వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వరప్రసాద్, విస్తరణ అధికారి గజేంద్రరెడ్డి, సూపర్‌వైజర్ పద్మావతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

వెల్దుర్తి(కృష్ణగిరి): అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సునీల్‌కుమార్ సూచించారు. వెల్దుర్తి పాత బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం ఆయన ప్రజలకు నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఇదివరకు ఉన్న ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ల స్థానంలో భారతీయ న్యాయ సురక్ష సంహితలు అమల్లోకి వచ్చాయన్నారు. వీటిని ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.